సాక్షి మంచిర్యాల

శుక్రవారం • 8 • ఆగస్టు • 2025



రావమ్మా మహాలక్ష్మీ..
వ్రతాలను నిండు మనస్సుతో చేస్తే సకల సౌభాగ్యాలు, పుత్రప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. నేడు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక కథనం..
8లో▸



మెడికల్ బోర్డు నిర్వహించాలి
సింగరేణి మెడికల్ బోర్డును తిరిగి మరోసారి నిర్వహించాలని ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో అన్ని గనులు, డిపార్టుమెంట్లపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.
9లో▸

గరిష్టం/కనిష్టం
30.1 /20.5

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

స్థానికం అంతా సిద్ధం!



గుజరాత్ నుంచి జిల్లాకు వచ్చిన బ్యాలెట్ బాక్సులతో డీపీవో వెంకటేశ్వరరావు, అధికారులు

- గుజరాత్ నుంచి బ్యాలెట్ బాక్సులు రాక
- శిక్షణ, పోలింగ్ కేంద్రాలు, అన్ని ఏర్పాట్లు పూర్తి
- రిజర్వేషన్లు తేలక ఎన్నికల నిర్వహణలో జాప్యం

జిల్లా వివరాలు

గ్రామ పంచాయతీలు	306
వార్డులు	2,680
ఎంపీటీసీలు	129
ఎంపీపీలు	16
జెడ్పీటీసీలు	16
జిల్లా పరిషత్	01
పోలింగ్ కేంద్రాలు	2,680
బ్యాలెట్ బాక్సులు	4,670

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: స్థానిక సమరానికి అంతా సిద్ధమైంది. తాజాగా గుజరాత్‌లోని జామ్ నగర్, ద్వారక జిల్లాల నుంచి 970 బ్యాలెట్ బాక్సులను పంచాయతీ అధికారులు గురువారం జిల్లాకు తీసుకొచ్చారు. ఎలక్షన్ ఆమోదం ఉన్న ఈ బ్యాలెట్ బాక్సులను వాటిని నస్పూర్‌లోని సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో బందోబస్తు మధ్య సురక్షితంగా భద్రపర్చారు. జిల్లాలో ఇప్పటికే 3,700 బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. వీటికి అదనంగా ఈ బాక్సులు తీసుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు రెండు నెలల క్రితమే తొలి విడత ఆర్వో(రిటర్నింగ్ ఆఫీసర్ల) శిక్షణ పూర్తయింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి మరోసారి శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, సౌకర్యాల కల్పన పూర్తయ్యాయి. జిల్లాలోని ఓటర్ల జాబితా సిద్ధం అయ్యింది. జాప్యంతో మరోమారు మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతోంది. తుది జాబితా వెలువడనుంది. జిల్లాలో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం అటు పంచాయతీ రాజ్, పరిషత్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. రెండు నెలల నుంచే కసరత్తు మొదలైనప్పటికీ రిజర్వేషన్లు తేలక ముందుకు సాగలేదు. దీంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానిపై స్పష్టత రావడం లేదు.

తేలని రిజర్వేషన్ల పంచాయితీ
పల్లెలు, పట్టణాల్లో పాలక వర్గాలు లేక స్పెషల్ ఆఫీసర్ల పాలన సాగుతోంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు విడుదల కాక పాలన సజావుగా సాగడం లేదు. పాలక వర్గాలు లేక ఏడాదికి పైగా అవుతోంది. హైకోర్టు సైతం సెప్టెంబర్‌లోగా స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంపుదల చట్టంపై కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గత చట్టాన్ని సవరిస్తూ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం నుంచి బిల్లు ఆమోదం కోసం కాంగ్రెస్ నాయకత్వం ఢిల్లీ స్థాయిలో పోరాడుతోంది. రిజర్వేషన్ల పెంపుపై అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయో తేలని, చెప్పలేని పరిస్థితి ఉంది. రెండు నెలల క్రితమే ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల.. రెండు దశల్లో నిర్వహణ అంటూ ప్రచారం జరగడంతో ఆశావహులంతా సిద్ధమయ్యారు. స్థానిక నాయకులు పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మొదలైనప్పటికీ రిజర్వేషన్లు తేలకపోవడంతో స్తబ్దుగా మారింది. మరోవైపు పంచాయతీ, పరిషత్ ఎన్నికలు పూర్తయితే మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో పట్టణాల్లో ఉన్న నాయకులు, పోటీ చేసే అభ్యర్థులు సన్నద్ధమయ్యారు. అయితే రిజర్వేషన్ల ప్రక్రియ ఓ కొలిక్కి వస్తేనే, పంచాయతీలు, వార్డులు, పరిషత్ ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంది. దీంతో ఎన్నికల నిర్వహణకు మరికొంత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి.

ఆటలకు వేళాయె..

- ఈ నెల చివరిలో ఎస్‌జీఎఫ్ పోటీల నిర్వహణ
- వేదికలు ఖరారు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని భావించిన రాష్ట్ర ప్రభుత్వం బాలబాలికలు క్రీడల్లో రాణించేలా ఏటా ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్ ఫెడరేషన్) పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా ఆగస్టులో నిర్వహించడానికి సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా క్రీడల నిర్వహణకు సంబంధించిన వేదికలను కూడా ప్రకటించింది. పోటీలను మూడంచెల పద్ధతిలో నిర్వహించనున్నారు. అండర్–14, 17 విభాగంలో పాఠశాలల విద్యార్థులకు మండల, జోనల్, జిల్లా స్థాయిలో విడతల వారీగా పోటీలు తలపెట్టనున్నారు. జిల్లాస్థాయిలో జరిగే పోటీల నిర్వహణకు వేదికలతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాళ్లను కన్వీనర్లుగా ప్రకటించారు. జోనల్, స్టేట్‌మీట్ వేదికలు ఖరారు కావాల్సి ఉంది. ముందుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడి నుంచి జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు.

క్రీడా పోటీలు ఇలా..
జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు వేదికలు ప్రకటించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీలు (జెడ్పీహెచ్ఎస్ భీమారం), బాక్సింగ్ (మోడల్‌స్కూల్, రాజీవ్‌నగర్), రెజ్లింగ్ (మదర్‌థెరిస్సా స్కూల్, మంచిర్యాల), టెన్నిస్ (జెడ్పీహెచ్ఎస్, నెన్నెల), బాస్కెట్ బాల్ (కార్మెల్ హైస్కూల్, మంచిర్యాల), చదరంగం (జెడ్పీహెచ్ఎస్, ఆకెనపల్లి), కబడ్డీ, అండర్–17 (ట్రినిటీ హైస్కూల్), అండర్–14, 17 (జెడ్పీహెచ్ఎస్, అచ్చలాపూర్), టేబుల్ టెన్నిస్ (జెడ్పీహెచ్ఎస్, ముల్కల్ల), వాలీబాల్, అండర్–17 బాలురు (జెడ్పీహెచ్ఎస్, జన్నారం), వాలీబాల్ అండర్–17 బాలికలు (లక్సెట్టిపేట్), వాలీబాల్ అండర్ 14, 17, బాలురు, బాలికలు (జెడ్పీహెచ్ఎస్, రెబ్బనపల్లి), ఉషూ, హ్యాండ్‌బాల్, అండర్–17 (సదన డిఫెన్స్ అకాడమి, మంచిర్యాల), త్రోబాల్ (జెడ్పీహెచ్ఎస్, కన్నెపల్లి), హ్యాండ్‌బాల్, అండర్–14 (జెడ్పీహెచ్ఎస్, నస్పూర్), బాస్కెట్ బాల్ (జెడ్పీహెచ్ఎస్, బెల్లంపల్లి), ఫెన్సింగ్ (స్ప్రింగ్ ఫీల్డ్ స్కూల్, మంచిర్యాల), ఖోఖో (జెడ్పీహెచ్ఎస్, భీమారం), సాఫ్ట్‌బాల్ (జెడ్పీహెచ్ఎస్, బెల్లంపల్లి), లాన్‌టెన్నిస్, టెన్నికాయిట్ (జెడ్పీహెచ్ఎస్, నెన్నెల) టగ్ ఆఫ్ వార్ (ఆక్స్‌ఫర్డ్ స్కూల్, మంచిర్యాల), క్రికెట్ (ట్రినిటీ హైస్కూల్, పల్లవి మోడల్ స్కూల్ మంచిర్యాల), ఫుట్‌బాల్ (హెవెన్ ఆఫ్ హోప్ స్కూల్)లో పోటీలు నిర్వహించనున్నారు. ఇతర క్రీడాపోటీలకు వేదికలు కేటాయించాల్సి ఉంది. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆగస్టు చివరలో పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ మహ్మద్ యాకూబ్ తెలిపారు. పోటీలకు సంబంధించి వేదికలు ఖరారు చేశామని, కన్వీనర్లను కూడా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యం

- ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్



మాట్లాడుతున్న డైరెక్టర్ మధుసూదన్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా పనిచేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రమాదాలను నివారించాలని సూచించారు. పల్లెబాట, పొలంబాట, పట్నంబాట నిర్వహించి విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదకరంగా, శిథిలావస్థలో ఉన్న స్తంభాలు, లూస్‌లైన్లు, వంగిన పోల్స్, ఎత్తు తక్కువ, పిచ్చిమొక్కలతో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి సరిచేయాలన్నారు. సీఈ ఆపరేషన్ అశోక్, ఎస్ఈ ఉత్తం జాడే, డీఈ ఎంఎం ఖైసర్, బెల్లంపల్లి డీఈ రాజన్న, ఎస్ఏవో రాజేశం, ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

గూడెంలో ముగిసిన పవిత్రోత్సవాలు



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న యాజ్ఞికులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 5న ప్రారంభమైన పవిత్రోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు మహాపూర్ణాహుతి, పవిత్ర అవరోహణము, స్నపన తిరుమంజనము, కుంభ ప్రోక్షణ, హారతి, మంత్రపుష్పము, మహాదాశీర్వచనము, తీర్థ ప్రసాద వితరణ కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో యాజ్ఞికులు అభిరామ చార్యులు, ప్రధాన అర్చకులు రఘుస్వామి, వేదపండితులు నారాయణశర్మ, భరత్‌శర్మ, అర్చకులు సంపత్‌స్వామి, సురేష్‌స్వామి, ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది చంద్రశేఖర్, సత్యనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి మొసళ్లు..



పొలంలో మొసలి పిల్ల

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నంనూర్ శివారు గోదావరినది తీర ప్రాంతాల్లోని పొలాల్లో మొసలి పిల్లలు తిరుగాడుతున్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో ఇప్పటికే మొసళ్లు ఉన్నట్లు 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఇటీవల ఓ మత్స్యకారుడి వలకు చిక్కిన మొసలి పిల్లను అటవీ అధికారులు బ్యాక్ వాటర్‌లో వదిలారు. రెండు రోజులుగా నంనూరు శివారులోని పొలాల్లో రైతులకు మొసలి పిల్లలు కనిపిస్తుండడంతో వాటిని జాగ్రత్తగా నీళ్లలోకి వెళ్లేలా చూస్తున్నారు.

చేనేత కార్మికుడికి రాష్ట్రస్థాయి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శంకరయ్య

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు లిక్కి శంకరయ్యకు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం దక్కింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అందించే అవార్డును రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పట్టు పరిశ్రమల కమిషనర్ శైలజా రామయ్యార్ చేతుల మీదుగా అందుకున్నారు. రూ.25 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. కళా నైపుణ్యంతో మగ్గంపై టస్సర్ పట్టువస్త్రం తయారు చేస్తూ చేనేత సంస్కృతిని ఇప్పటికీ కాపాడుతున్నందుకు గానూ శంకరయ్యకు ఈ గౌరవం దక్కింది.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న సబ్ కలెక్టర్ మనోజ్

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం ఇస్తానని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ ఇనుకొండ ఈశ్వర సత్యసాయి దుర్గ (ఐఈఎస్ఎస్‌డీ) మనోజ్ అన్నారు. గురువారం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం, చిన్ననాటి జ్ఞాపకాలు, తదితర అంశాలు పంచుకున్నారు.

కుటుంబ నేపథ్యం
ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అనంతారం తండ్రిగారి స్వస్థలం. తల్లిదండ్రులు ఇనుకొండ గంగాభవాని, వెంకటేశ్వర్లు. సోదరి లక్ష్మీ మౌనిక. తండ్రి పోలీసు శాఖలో ఏసీబీ సీఐగా పనిచేస్తున్న క్రమంలో రాజమండ్రికి బదిలీ అయిన సమయంలో అక్కడ జన్మించాడు.

విద్యాభ్యాసం
మంచిర్యాల జిల్లా తాండూర్‌లోని విద్యాభారతి పాఠశాలలో 4, 5 తరగతులు, మెట్‌పల్లిలో ఆరో తరగతి, 7 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. 2013 నుంచి 2015 వరకు గుంటూరులోని భాష్యం విద్యాసంస్థలో ఇంటర్, 2015లో పోటీ పరీక్షకు హాజరై వరంగల్‌లో నీట్‌లో సీటు సాధించాడు. 2019లో కంప్యూటర్ సైన్స్ గ్రూపులో బీటెక్ పూర్తి. 2021లో సివిల్స్ రాయగా ఐఆర్ఎస్‌కు ఎంపికకావడంతో ఇన్‌కంట్యాక్స్ అధికారిగా ఉద్యోగం వచ్చింది. నాగ్‌పూర్‌లో ట్రైనింగ్ చేస్తుండగా 2022లో ఐఏఎస్ పాసయ్యా. 2023 ఆగస్టు నుంచి 2024 ఏప్రిల్ వరకు ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో ఐఏఎస్ శిక్షణ పూర్తి. 2024 నుంచి 2025 మార్చి వరకు సంగారెడ్డిలో ట్రెయినీ కలెక్టర్‌గా విధులు. 2025 ఏప్రిల్, మేలో కేంద్ర ప్రభుత్వ సర్వీసులో అసిస్టెంట్ సెక్రెటరీగా బాధ్యతలు. జూన్, జూలైలో రెండు నెలల పాటు మరోసారి ముస్సోరిలో శిక్షణ. గత జూలై 25న ఐఏఎస్ శిక్షణ పూర్తికాగానే బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా పోస్టింగ్.

బాధ్యతల స్వీకరణ..
మంచిర్యాలఅగ్రికల్చర్: బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన మనోజ్ కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

బుగ్గలో ప్రత్యేక పూజలు
బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీబుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో సబ్ కలెక్టర్ మనోజ్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఆలయ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ శ్రీదేవి, కన్నాల మాజీ సర్పంచ్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లి ప్రాంతంపై అవగాహన
నాన్న తాండూర్ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆయనతో కలిసి ఆయా ప్రాంతాలన్నీ తిరిగా. ఆ జ్ఞాపకాలు నేటికీ నాకు చాలా బాగా గుర్తున్నాయి. ఈ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన ఉంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



లింగాపూర్‌లో డ్రెయినేజీ పరిశీలిస్తున్న కలెక్టర్

దండేపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. గురువారం దండేపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యులు, రోగులతో మాట్లాడారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం దండేపల్లి కేజీబీవీ, లింగాపూర్ మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ, సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం లింగాపూర్ గ్రామంలో వర్షం కురుస్తుండడంతో గొడుగు పట్టుకుని డ్రెయినేజీలు పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ధర్మరావుపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ద్వారక ఉన్నత పాఠశాలను పరిశీలించారు. బీసీ హాస్టల్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఏఈ బషీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

చిరస్మరణీయుడు జయశంకర్ సార్..

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ, సుమన్, ఆర్ఎస్పీ

మందమర్రిరూరల్: తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ప్రొఫెసర్ జయశంకర్‌సార్ అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి ఏర్పాటు చేసిన జయశంకర్ విగ్రహాన్ని గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం జయశంకర్ తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. పోరాటాలు, ఆత్మ బలిదానాలు చేసి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ నాయకులు ఆగం పట్టిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు డబ్బు సంచులతో దొరికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయనే నెపంతో కేసీఆర్‌ను జైలుకు పంపించే కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు.

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష
రామకృష్ణాపూర్: తెలంగాణకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని, రాష్ట్రాన్ని భద్రంగా ఉంచుకునేందుకు ప్రజలు బీఆర్ఎస్ పక్షాన నిలవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీని వాస్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి గురువారం ఆర్కేపీలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. సూ పర్‌బజార్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20 నెలల కాంగ్రెస్ పాలనలో అడుగడుగునా మోసమే అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన గా లికొదిలేసి తరచూ ఢిల్లీకి వెళ్లడానికే పరిమితమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఆగమవుతున్న తెలంగాణను తిరిగి గాడిలో పెట్టేందు కు ప్రధాన ప్రతిపక్షంగా కొట్లాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించేలా ప్రతి ఒ క్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ రాజరమేశ్, కంభగోని సుదర్శన్‌గౌడ్, రామిడి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి



మాట్లాడుతున్న పరిశీలకులు శ్రీనివాసచారి

మంచిర్యాలటౌన్: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వారికి చేరవేయాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని జిల్లా పరిశీలకులు, తెలంగాణ మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీఈబీ కార్యాలయంలో గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి జిల్లాలోని అన్ని మండలాల ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, తాగునీటి సౌకర్యం, ప్రహరీ నిర్మాణాలు, మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్స్ అందేలా చూడాలన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అత్యంత ముఖ్యమైన పాత్ర మండల విద్యాశాఖ అధికారులదేనన్నారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ఎంఈవోలు రోజుకు రెండు పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

11న నులి పురుగుల నివారణకు మాత్రలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: 1 నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ ఈ నెల 11న జిల్లా వ్యాప్తంగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11న జిల్లాలోని దాదాపు 1,58,480 మంది పిల్లలకు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. 930 అంగన్‌వాడీ కేంద్రాలు, 650 మంది ఆశా కార్యకర్తలు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 149 ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు జూనియర్ కళాశాలల్లో మాత్రలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పిల్లల్లో నట్టలు ఉండడం వల్ల రక్తహీనత, జ్ఞాపకశక్తిని కోల్పోవడం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, పోషకాహారంతో బాధపడడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, డీపీహెచ్ఎన్ పద్మ, డెమో బుక్క వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం



తల్లిపాల విశిష్టత వివరిస్తున్న రౌఫ్‌ఖాన్

మంచిర్యాలటౌన్: తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్ అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తల్లిపాల విశిష్టత గురించి బాలింతలకు వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ తజ్బియా సుల్తానా, సీహెచ్‌వో రాందేవ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ చందన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వైఖరి తెలపాలి



మాట్లాడుతున్న వనం సత్యనారాయణ

నస్పూర్: బీసీ రిజర్వేషన్లపై బీజేపీ తమ స్పష్టమైన వైఖరి తెలియజేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వనం సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం సీసీసీలోని నర్సయ్య భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి మండల సమావేశం నిర్వహించారు. నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దన్నారు. బీజేపీ ప్రభుత్వం కుల గణన చేయకుండా 11 సంవత్సరాలుగా కాలయాపన చేస్తోందని విమర్శించారు. అనంతరం మండల అధ్యక్షుడిగా బొడ్డు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా జోగుల ఆంజనేయులు, కోశాధికారిగా కొత్తపల్లి మహేశ్, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను, 17 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టె కిషన్‌రావు, జోగుల మల్లయ్య, లింగం రవి, ముస్కె సమ్మయ్య, దొడ్డిపట్ల రవీందర్, సదానందం, పోశం , తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న 'ఎల్లంపల్లి' నీటిమట్టం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద ఎల్లంపల్లి (శ్రీపాదసాగర్) ప్రాజెక్ట్ నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా గురువారం 145 మీటర్లు (12.524 టీఎంసీలు) నీటిసామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద 331 క్యూసెక్కులు వస్తుండగా అవుట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

క్లుప్తంగా

దూడ మృతితో.. తల్లడిల్లిన ఆవు



మృతిచెందిన దూడను చూసి తల్లడిల్లుతున్న ఆవు

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మూడురోజుల వయస్సు ఉన్న లేగదూడను బస్సుఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆ దూడను చూసి ఆవు తల్లడిల్లింది. బస్టాండ్‌లో నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేశారని హడావుడి చేసిన ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, దూడ మృతికి కారణమైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని పలువురు ప్రశ్నించారు. మూడురోజుల క్రితం రోడ్డుపై దూడ ప్రసవించిన ఆవును యజమానికి చేరవేయాలని సోషల్‌మీడియాలో షేర్ చేసిన సమయంలో స్పందించి ఉంటే దూడ మృతిచెందేది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. మృతిచెందిన దూడను బజరంగ్‌దళ్, ఏబీవీపీ కార్యకర్తలు బైక్‌పై తరలించారు.

బ్యాక్‌వాటర్‌లో మునిగి కాపరి మృతి

భైంసారూరల్: పల్సికర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో మునిగి గేదెల కాపరి కాత్రే మనోజ్(21) మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన మనోజ్ బుధవారం గేదెలు మేపేందుకు గుండేగాం శివారులోకి వెళ్లాడు. ఈక్రమంలో మేత మేస్తున్న గేదె.. గ్రామ సమీపంలోని రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లోకి వెళ్లింది. గేదెను బయటకు తీసేక్రమంలో మనోజ్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. బ్యాక్ వాటర్ నీరు ఎక్కువగా ఉండడంతో గురువారం మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో నాలుగు చోరీలకు పాల్పడిన నిందితుడు మేకల్వార్ సాయినాథ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గతనెల 30న పట్టణంలోని ఆర్‌ఆర్‌నగర్‌లో బైక్, కుమ్మరికుంటలోని రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడగా, ఓ ఇంట్లోని తాళం పగులగొట్టి 5 తులాల వెండి, మరో ఇంట్లో రూ.10 వేలు, హ్యాండిక్యాప్ కాలనీలోని ఓ ఇంట్లో నుంచి రూ.10 వేల నగదు అపహరించినట్లు పేర్కొన్నారు. గురువారం వినాయక్‌చౌక్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో ఆయన్ను విచారించగా చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఆయన నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బాలికల గురుకులంలో అర్ధరాత్రి చొరబాటు!

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ బాలికల గురుకులంలో బుధవారం అర్ధరాత్రి అగంతకులు చొరబడినట్లు తెలిసింది. గురుకుల ప్రహరీ ఎక్కి నలుగురు యువకులు డార్మెటరీలోకి ప్రవేశించి తీవ్ర భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం. మెలకువ వచ్చిన కొందరు వారిని చూసి కేకలు వేయగా చాకచక్యంగా తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఆ యువకులు మత్తులో ఉన్నట్లు తెలుస్తుండగా అర్ధరాత్రి బాలికల గురుకులంలో ప్రవేశించడం చర్చనీయాంశమైంది. గంజాయికి అలవాటు పడి ఈ చర్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. కాగా, ఈ ఘటనతో బాలికల గురుకులంలో ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురిచేసింది. రాత్రి కాపలా చర్యలు సరిగా చేపట్టడం లేదనడానికి సంబంధిత గురుకుల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ ఘటన విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు చర్చించుకుంటున్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

ఆదిలాబాద్: విజయవాడ–గూడూరు సెక్షన్ మూడోలైన్ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో ద.మ రైల్వే పలు రైళ్లు రద్దుచేసింది. కృష్ణా ఎక్స్‌ప్రెస్ సర్వీస్ తిరుపతి–ఆదిలాబాద్ మధ్య రైలు (నంబర్17405)ను ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు రద్దు చేసింది. అదేవిధంగా ఆదిలాబాద్–తిరుపతి రైలు (నంబర్ 17406)ను ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు రద్దు చేసినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరింది.

రావమ్మా మహాలక్ష్మి..!

- నేడు వరలక్ష్మివ్రతం
- అష్టైశ్వర్యాలకు వరం
- సౌభాగ్యాలు, సిరి సంపదలు కలుగుతాయని ప్రతీక



వరలక్ష్మి వ్రతంలో మహిళలు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): నేడు శ్రావణ శుక్రవారం.. మహిళలకు ఈ వారం అత్యంత శ్రేష్టమైనది. ఈ వ్రతాలను నిండు మనస్సుతో చేసేవారికి సకల సౌభాగ్యాలు, పుత్రప్రాప్తి కలిగి సుఖంగా ఉంటారని విశ్వాసం. మహాలక్ష్మిని వరలక్ష్మి పేరుతో అర్చించడం మన సంప్రదాయం. ఈరోజు ఇళ్లను శుభ్రపర్చి, ముంగిట ముగ్గులతో అలంకరించి కలశాన్ని ఏర్పర్చి పూజలు నిర్వహిస్తే సిరి సంపదలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. అయితే వరలక్ష్మి వ్రతం గురించి వివిధ కథలు, పురాణాలు, ప్రాచుర్యంలో ఉన్నాయి. దీనిపై సాక్షి అందిస్తున్న కథనం.

పూజా విధానం..

ఓం శ్రీ వరలక్ష్మిదేవ్యైనమః ఆచమ్య ఓం కేశవాయ స్వాహా, ఓం నారాయణ స్వాహా, ఓం మాధావాయాస్వాహా అని జలము తీసుకోవాలి. ప్రాణాయామం జపించాలి, పుష్పాంక్షతలు పట్టుకుని సంకల్పం చెప్పాలి. పుష్పంతో కలశంలోని పూజ వస్తువులు, దేవునిపై, తనపై చల్లుకోవాలి.

మంటపం తయారు చేయాలి

మంటపం మాదిరిగా తయారు చేసి అందులో వరలక్ష్మి ఫొటో పెట్టి, అలంకరణం చేయాలి. పటం ముందు ఒక కొత్త తెలుపు వస్త్రం పర్చాలి. బియ్యం పోసి తమలాపాకులు ఉంచి, కలశాన్ని గంధం కుంకుమలతో అలంకరించాలి. అనంతరం పూజ ప్రారంభించాలి.

వైభవ లక్ష్మి అవతారాలు..

ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతాన లక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధనలక్ష్మి.

అనుగ్రహాలు పొందాలి..

రాక్షసుల గురువు శుక్రాచార్యుడు. ఈ శుక్రాచార్యుల పేరుపై శుక్రవారం ఏర్పడిందని హిందు పురాణాలు చెబుతున్నాయి. శుక్రచార్యుని తండ్రి బృగుమహార్షి. బ్రహ్మదేవుని సంతానంలో ఒకరు. ఇతను లక్ష్మిదేవికి తండ్రి కూడా. అందుకే లక్ష్మిదేవికి భార్గవి అని పేరు. ఈవిధంగా లక్ష్మిదేవికి శుక్రాచార్యుడు సోదరుడు. అందుకు శుక్రవారమంటే ఆమెకు ఎంతో ప్రీతికరమైనది. లక్ష్మిదేవి రూపురేఖలో, వస్త్రాధారణలు, రంగులకు ప్రాధాన్యం ఉంది. లక్ష్మిదేవి ఎక్కువగా ఎరుపు, ఆకుపచ్చ రంగులు ధరించినట్లు చిత్రాలు చిత్రిస్తారు. ఎరుపు రంగుశక్తికి, ఆకుపచ్చ సాఫల్యతకు, ప్రకృతికి చిహ్నాలు, ప్రకృతికి లక్ష్మిదేవి ప్రతినిధి. లక్ష్మిదేవి ధరించే బంగారు ఆభరణాలు బంగారం ఐశ్వర్యానికి సంకేతం. విష్ణు ఆరాధనలో లక్ష్మిపూజకు ప్రాధాన్యం ఉంది. లక్ష్మిదేవి అనుగ్రహంతో కాని విష్ణుమూర్తిని దరిచేరలేం. లక్ష్మిప్రసన్నత లేకుండా విష్ణువు భక్తులకు అందుబాటులో ఉండరు. సదాచారం, సత్ప్రవర్తన లక్ష్మిదేవికి ఆహ్వానాలు. ఈ రెండు ఉంటే లక్ష్మిదేవి, విష్ణుమూర్తి అనుగ్రహాలు పొందవచ్చు.

వరలక్ష్మి పూజ అత్యంత శ్రేష్టం..

ఆనాటి నుంచి నేటి వరకు వివిధ గ్రామాల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం కొనసాగుతుంది. వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించేందుకు మహిళలు ఆలయాలకు చేరుకుంటారు. మహిళలు వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తే అత్యంత శ్రేష్టమని భావించి పూజ నిర్వహిస్తారు.

శుక్రవారమే లక్ష్మి ఆరాధన ఎందుకు?

లక్ష్మిదేవిని గురు, శుక్రవారాల్లో ప్రత్యేకంగా పూజిస్తారు. ఈరోజుల్లో దేవిని ప్రసన్నం చేసుకుని ఆమె ఆశీస్సులు పొందేందుకు వ్రతాలు చేస్తారు. లక్ష్మిదేవికి ప్రీతికరమైన స్తోత్రాలు, స్తుతులు పాటిస్తారు. ఆ రోజు నుంచి కొంతమంది ఉపవాసం ఉంటారు. ఈ నాడు మానవులే కాదు, పురాణాల్లో రాక్షసులు కూడా శుక్రవారం లక్ష్మిదేవిని పూజించేవారనడానికి ఎన్నో కథలున్నాయి. అసలు శుక్రవారమే లక్ష్మిదేవికి ఎందుకు అనుకూలమైన దినంగా పేరు గాంచింది? అందులో రాక్షస సంహారి అయినా విష్ణుమూర్తి భార్యను రాక్షసులు కొలవడమేమిటి అనే సందేహాలు అనేకుల్లో ఉన్నాయి.

దూది గొండలే ప్రత్యేకం

- భైంసాలో నేటికి అవే..
- రాఖీ పౌర్ణమికి ముందుగానే ఇంటింటా పంపిణీ



దూదిగొండలు

భైంసా: అక్కాతమ్ముళ్ల అనురాగానికి, అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా భైంసా ప్రాంతంలో పూజార్లు, అర్చకులు ఇంటింటా ఇప్పటికీ దూది గొండలే ఇస్తారు. ఈ ప్రాంతం మహారాష్ట్రకు ఆనుకుని ఉండడంతో రాఖీలను గొండలు అని పిలుస్తారు. సన్నని దారానికి దూదిని పసుపులో, కుంకుమలో, చంద్రం, గులాలు ఇలా పూజకువాడే వాటిలో కలుపుతారు. ఇలా కలిపిన దూది నుంచి దారాన్ని బయటకు తీసి గొండగా కడుతారు. ఇలా తయారు చేసిన గొండలను గ్రామాల్లో ముందుగా అక్కడి పూజార్లు ప్రత్యేక పూజలు చేస్తారు. పౌర్ణమికి రెండు రోజుల ముందుగానే ఇంటింటికి వెళ్లి ఈ దూదిగొండలను పంచిపెడతారు. ఇవి తీసుకున్నవారు ఇంటికివచ్చిన పూజార్ల కాళ్లు కడిగి వారిని లోనికి ఆహ్వానిస్తారు. ఇచ్చిన దూదిగొండలు తీసుకుని ఇంట్లో పండించిన బియ్యం, జొన్నలు, పప్పులు దానం చేస్తుంటారు. రాఖీపౌర్ణమి రోజున ఇంటికి వచ్చే ఆడపడుచులు పూజార్లు ముందుగా ఇచ్చిన ఈ దూదిగొండలనే కడతారు.

ఆడపడుచులకు పుట్టింటి కానుకలు

తోబుట్టువులకు దూదిగొండలు చేతికి కట్టగానే కానుకలు అందిస్తారు. సోదరులు పుట్టింటి ఆడపిల్లకు కాళ్లు మొక్కి నగదు, బట్టలు కానుకగా ఇస్తుంటారు. రాఖీ పౌర్ణమి నుంచి పొలాల అమావాస్య వరకు 15 రోజులపాటు వీలు దొరికినప్పుడల్లా దూరప్రాంతంలో ఉండే పుట్టింటి ఆడపడుచు ఎప్పుడైనా వచ్చి తోబుట్టువులకు రాఖీలు కట్టి వెళ్తుంది. రాఖీ పౌర్ణమి అంటే ఇక్కడి వారు ప్రత్యేకంగా భావిస్తారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆడపిల్లలు పుట్టింటికి రావడం భైంసా చుట్టుపక్కల ఇప్పటికీ ఆనవాయితే. నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి వెంటవెంటనే వచ్చే ఈ రెండు పండుగలకు ఆడపిల్లలు తప్పకుండా పుట్టింటికివస్తుంటారు. చేతికి రాఖీ కట్టిన వెంటనే ఆడపిల్లకు కాళ్లు మొక్కి ఆశీర్వాదాలు తీసుకుంటారు. చేతికిరాఖీ కట్టి నోరు తీపి చేసి తోబుట్టువులను ఆశీర్వదిస్తారు.

సంఘాల ఆధ్వర్యంలో..

ఇంట్లో రాఖీ పౌర్ణమి సందర్భంగా తోబుట్టువులతో పండుగ చేసుకున్న అనంతరం అంతా బయటకు వస్తారు. సంఘాల ఆధ్వర్యంలో సామూహికంగా రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకుంటారు. ప్రతి పల్లెటూరిలోనూ ఈ వేడుకలు వైభవంగా జరుగుతాయి. హిందువాహిని, ఆర్‌ఎస్‌ఎస్‌లతోపాటు సరస్వతీ శిశుమందిరాల విద్యార్థులు భైంసా డివిజన్‌లోని అన్ని ప్రాంతాలకు వెళ్లి రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. భైంసాలో విధుల్లో ఉండే పోలీసులు, ఆర్టీసీ డ్రైవర్లు, ఆసుపత్రి సిబ్బంది, అత్యవసర సేవలు అందించేవారికి భైంసావాసులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతారు.

ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ల బదిలీ

మంచిర్యాలఅగ్రికల్చర్: మల్టీజోన్ పరిధిలో పనిచేస్తున్న తహసీల్దార్ల బదిలీ చేస్తూ రాష్ట్ర ల్యాండ్ అడ్మిస్ట్రేషన్ కమిషనర్ లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. మంచిర్యాల జిల్లా నుంచి ఎం.భోజన్న, ఏ.సంధ్యారాణి నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఈ.పుష్పలత మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు.

తండ్రి పేరిట పట్టా చేయలేదని ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

తలమడుగు: వారసత్వంగా ఉన్న భూమిని తండ్రి పేరిట పట్టా చేయలేదని మనస్తాపం చెందిన యువకుడు వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని సుంకిడిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సుంకిడి గ్రామానికి చెందిన దాసరి ప్రశాంత్ (30), సుజాత దంపతులు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. తన తాత పేరు మీద ఉన్న భూమి వారసత్వంగా వచ్చిన 7.5 ఎకరాల వ్యవసాయ భూమిని పెద్దనాన్న దాసరి లింగన్న పట్టా చేసుకున్నాడు. ఈక్రమంలో ప్రశాంత్ నిత్యం మద్యం తాగి వచ్చి ఆ భూమిని తండ్రి ఎర్రన్న పేరిట పట్టా చేయాలని పెద్దనాన్నతో గొడవ పడుతుండేవాడు. పట్టా ఉండి ఉంటే రైతుబంధు డబ్బులు వచ్చేవి లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని తల్లిదండ్రులతో గొడవపడేవాడు. అయినా పెద్దనాన్న పట్టా చేయకపోవడంతో బుధవారం ఉదయం మద్యం తాగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రయిన రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం సుంకిడి సమీపంలోని వాగులో మృతదేహం తేలింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రశాంత్‌గా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఓ లాడ్జిలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కోడర్ గ్రామానికి చెందిన కృష్ణ (22) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. నాలుగో సంవత్సరంలో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందాడు. తండ్రి గంగన్న ధైర్యం చెప్పాడు. 20 రోజుల క్రితం కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఈనెల 5న తిరిగి వస్తున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. ఈక్రమంలో బుధవారం నిర్మల్‌లో ఆగి ఓ లాడ్జిలో రూం అద్దెకు తీసుకున్నాడు. అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఇలేగాంలో వృద్ధుడు..

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన అవదూత్ పాపన్న(85) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు శంకర్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. అవదూత్ పాపన్న భార్య రెండేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి కుమారుడి వద్ద ఉంటున్నాడు. గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి కుమారుడు అవదూత్ శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..



శంకర్ (ఫైల్)

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని డౌనల్ ప్రాంతానికి చెందిన పందిర్ల శంకర్(45) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. పందిర్ల శంకర్ మంగలిషాపు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత రెండేళ్లుగా మద్యానికి బానిసై షాపు నడిపించడం లేదు. మద్యం మత్తులో బుధవారం రాత్రి ఇంటికి వచ్చి ముందు ఉన్న షెడ్డుకు ఉరేసుకున్నాడు. పిల్లలు లోపలి నుంచి చూసి అరిచారు. శంకర్ తండ్రి నాగయ్య వచ్చి చూసేసరికి ఉరేసుకుని ఉన్నాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జూడో చాంపియన్‌గా ఆదిలాబాద్

- 22 పతకాలతో స్పోర్ట్స్ విద్యార్థుల సత్తా
- 12 మంది జాతీయస్థాయికి ఎంపిక



రాష్ట్రస్థాయి విజేతలతో కోచ్ రాజు, నిర్వాహకులు

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఆదిలాబాద్ క్రీడా పాఠశాల విద్యార్థులు 22 పతకాలతో సత్తాచాటారు. తెలంగాణ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు వరంగల్ జిల్లా కేంద్రంలోని కెమిస్ట్రీ నిర్వహించిన కేడెట్, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో 12 స్వర్ణాలు, 4 రజతం, 5 కాంస్య పతకాలతో ప్రతిభ కనబర్చారు. కేడెట్ విభాగంలో మొత్తం 9 బంగారు పతకాలతో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడం విశేషం. ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించిన క్రీడాకారులు సెప్టెంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు బీహార్ రాజధాని పాట్నాలో జరగనున్న జాతీయస్థాయి జూడో పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అదేవిధంగా కేడెట్ విభాగంలో బంగారు పతకం సాధించిన క్రీడాకారులు అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నో వేదికగా జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జూడో కోచ్ రాజు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్లుగా నిలవడం పట్ల డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నజీర్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారధి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, క్రీడా పాఠశాల హెచ్‌ఎం భూమన్న, డీఎస్‌ఏ సిబ్బంది తదితరులు అభినందించారు.

సబ్–జూనియర్ బాలికల విభాగం (స్వర్ణం)

ఉష్విని (–48 కేజీలు), ఝూన్సీ (–52), అక్షిత (–57).

కేడెట్ బాలుర విభాగం (స్వర్ణం)

సతీశ్ (–50), తరుణ్ (–55), హర్షవర్ధన్ (–60), మధు (–81)

కేడెట్ బాలికలు (స్వర్ణం)

నాగిణి ప్రియా (–44), రమ్య (–48), చాందిని (–52), అలేఖ్య (–57), శ్రీజ (–63)

సబ్–జూనియర్ బాలుర (రజతం)

మనోజ్ కుమార్ (–40)

కేడెట్ బాలురు (రజతం)

శ్రీహరి (–60), సంతోష్ (–90)

కేడెట్ బాలికల (రజతం)

డి. సునీత (–44), జి. సహస్ర (–48)

సబ్–జూనియర్ బాలుర (కాంస్యం)

విశ్వనాథ్ (–45), ఈశ్వర్ (–50), శ్రీజిత్ (–55), దీపక్ (–60)

కేడెట్ బాలురు (కాంస్యం)

రామ్ చరణ్ నాయక్ (–66కేజీలు)

సరస్వతి కెనాల్‌కు నీటి విడుదల



విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సోన్: ఎస్సారెస్పీ సరస్వతి కాలువ ద్వారా నీటిని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గురువారం దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. సరస్వతి కెనాల్ పరివాహక ప్రాంత రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ సురేష్, ఈఈ అనిల్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, చిన్నయ్య, నాయకులు రావుల రాంనాథ్, సరికెల గంగన్న, హరీశ్‌రెడ్డి, రమేశ్, రాజేశ్వర్, ముత్యంరెడ్డి, నర్సారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సాగర్, అశోక్, ఉదయ్, జీవన్‌రెడ్డి, నవీన్, నరేశ్, సాయన్న, సంతోష్, గంగారెడ్డి, గంగయ్య, నాగయ్య, సాయినాథ్, నర్సయ్య, గణేశ్, నాగరాజ్, భూమేశ్, ప్రశాంత్ ఉన్నారు.

చెట్లు నరికిన ఐదుగురిపై కేసు




బైండోవర్ అయిన కమలాకర్‌తో అధికారులు

జన్నారం: జన్నారం అటవీ రేంజ్ పైడిపల్లి బీట్‌లో అక్రమంగా టేకు చెట్లు నరికిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. చెట్లు నరుకుతున్నారనే సమాచారంతో సెక్షన్ అధికారి శివకుమార్ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి తనిఖీ చేపట్టారు. దుంగలతో వస్తున్న ఐదుగురిని పట్టుకునేందుకు వెళ్లారు. వారిని గమనించిన మైనేని తిరుపతి, డేగ మహేశ్, మైనేని సురేశ్, ఎండీ తహార్ పాషాలు దుంగలు పడేసి పరారీ అయ్యారు. మరొకరు కండ్లె కమలాకర్‌ను పట్టుకుని ఎఫ్‌ఎస్‌వో శివకుమార్, బీట్ అధికారి లాలుబాయి, కానిస్టేబుల్ చంద్రమౌళి గురువారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎఫ్‌ఆర్వో తెలిపారు.

అయ్యో.. ఏ తల్లి బిడ్డో!

- డ్రైయినేజీలో మృత శిశువు లభ్యం
- భైంసాలో అమానవీయ ఘటన



డ్రైయినేజీలో శిశువు మృతదేహం

భైంసాటౌన్: పట్టణంలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. నెలలు నిండని ఓ శిశువు మృతదేహం మురుగుకాలువలో పడి ఉండడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని నర్సింహనగర్ ప్రాంతంలో రెయిన్‌బో స్కూల్ వెళ్లే మార్గంలో ఓ డ్రైయినేజీలో గురువారం మధ్యాహ్నం నెలలు నిండని శిశువు మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా, వారు మున్సిపల్ అధికారులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అనంతరం డ్రైయినేజీలో నుంచి శిశువు మృతదేహాన్ని వెలికి తీయించారు. ఎవరైన అబార్షన్ చేయించుకుని శిశువు మృతదేహాన్ని డ్రైయినేజీలో పడేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈమేరకు సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. శిశువు మృతదేహాన్ని స్థానిక ఏరియాస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రముఖులు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మూడురోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ శిశుమందిరాల నుంచి 954 మంది విద్యార్థులు పాల్గొనగా, వారికి వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాపీఠం రాష్ట్ర సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడాకారులకు గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో ప్రాంత శైక్షనిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ వేణుమాధవ్, విభాగ్/జిల్లా అధికారులు పాల్గొన్నారు.


తెలంగాణ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ ప్రవేశపెట్టాలి



సీపీటీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఫణి

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్రం పేరుతో న్యూఢిల్లీకి ప్రత్యేక సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం అధ్యక్షుడు ఫణి కోరారు. గురువారం ద.మ రైల్వేజోన్ సికింద్రాబాద్ సీపీటీఎం రవిచందర్‌ను రైల్వే నిలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రైలును హైదరాబాద్–న్యూఢిల్లీకి వయా కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల మీదుగా నడిపించాలని సూచించారు. పెద్దపల్లి జంక్షన్‌లో తిరువనంతపురం స్వర్ణ జయంతి వీక్లీ, వైన్ గంగా బై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఓదెలలో కరీంనగర్–తిరుపతి బై వీక్లీ సూపర్ ఫాస్ట్, విశాఖపట్నం స్వర్ణజయంతి బై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును మంచిర్యాలలో ఆపాలని విన్నవించారు. బల్లార్షా–కాజీపేట ఎక్స్‌ప్రెస్ రైలును చర్లపల్లికి, కాచిగూడ–కరీంనగర్ డెము రైలును పెద్దపల్లి, తిరుపతి–కరీంనగర్ రైలును నిజామాబాద్‌కు, రాయలసీమ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును బోధన్‌కు, నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైలును కాజీపేటకు పొడిగించాలని కోరారు. ఐఆర్‌సీటీసీ రైల్వే రిజర్వేషన్ పోర్టల్‌లో పెద్దపల్లి, బెల్లంపల్లి, మంచిర్యాల, జమ్మికుంట, రామగుండంలో ఏవైతే ప్రయోగాత్మకంగా రైళ్ల హాల్ట్‌లను నవీకరించలేదో, వాటి గురించి సీపీటీఎంతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభానికి, ఆయా రైల్వే స్టేషన్లలో ప్రతిపాదిత రైళ్ల నిలుపుదలకు కృషి చేస్తామని సీపీటీఎం హామీ ఇచ్చినట్లు ఫణి తెలిపారు.

ఒప్పందాల అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: ఇప్పటివరకు జరిగిన డైరెక్టర్ (పా), సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశాల్లో జరిగిన ఒప్పందాల అమలుకు ఉత్తర్వులు జారీచేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కోరారు. యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ ఎన్.బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ చర్చల్లో అవగాహనకు వచ్చి ఒప్పందం చేసుకున్న ప్రతీ డిమాండ్ నెరవేర్చాలన్నారు. మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ కల్పించడానికి ఒప్పందం జరిగిందని దీన్ని అమలు చేయాలన్నారు. ఈపీ ఆపరేటర్ల సమస్య, ప్రమోషన్లు, మారుపేర్ల సమస్య ఇంకా ఇతర డిమాండ్లపై చర్చల్లో కుదిరిన అంగీకారం మేరకు అమలయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇటీవల మెడికల్ బోర్డులో అర్హులైన వారికి న్యాయం జరగలేదనితిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలని కోరారు.

ప్రైవేటు సెక్యూరిటీ వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో సెక్యూరిటీ సిబ్బంది నాయకులు సిరిపురం రాజేశం, రాందేని శ్రీనివాస్, కలవేణి స్వామి మాట్లాడారు. కంపెనీ వ్యాప్తంగా అన్ని డిపార్టుమెంట్‌లో 30 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. 12 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలోనైనా వేతనాలు పెంచడంతోపాటు కంపెనీ క్వార్టర్లను కేటాయించాలన్నారు. 8.33 శాతం ఉన్న బోనస్‌ను 20 శాతానికి పెంచాలన్నారు. లాభాల్లో మొదటిసారిగా గత సంవత్సరం రూ.5 వేల బోనస్ చెల్లించారని, ఈసారి లాభాల శాతం రూపంలో వాటా ఇవ్వాలని కోరారు. కంపెనీ ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు వైద్యం అందించాలన్నారు. తమకు మొదటిసారిగా ఈఎస్ఐ సౌకర్యం కల్పించడానికి యాజమాన్యం అంగీకరించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. భరత్ కుమార్, సంతోష్, రాజేశ్, నరేందర్‌గౌడ్ సురేష్ పాల్గొన్నారు.